క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే వెంకటప్రతాప్ అప్పారావు



ముసునూరు: కార్యకర్తల కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నిరంతరం అండగా నిలుస్తుందని నూజివీడు ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. గోపవరంలో గ్రామ పార్టీ యూత్ అధ్యక్షుడు ఇంతియాజ్ తాత ఖాజావలి ఇటీవల మృతి చెందారు. సోమవారం సాయంత్రం గ్రామ పార్టీ అధ్యక్షుడు గోపి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంతియాజ్ ఇంటికి చేరుకున్నారు. ఖాజావలి చిత్రపటానికి నివాళులర్పించారు. గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు ఖాలీషా మస్తాన్ వలి, వెంకమ్మ, జిల్లా రైతు సలహా సంఘ కార్యదర్శి రవీంద్రరెడ్డి, మైనారిటీ సంఘ జిల్లా అధ్యక్షుడు చరణ్, నూజివీడు పట్టణ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు



చాట్రాయి: మండలంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పొలాలను దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు. సీకే పాడు చానల్ ద్వారా వచ్చే వరద నీటితో కోటపాడు, చిన్నంపేట గ్రామాల్లోని చెరువుల ద్వారా సాగునీరు పొలాలకు అందించి నాట్లు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తమ్మిలేరు రిజర్వాయర్ మూడు కాలువల ద్వారా వచ్చే నీటితో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. కాగా నీటి వసతి లేని గ్రామాల్లో బోర్ల సాయంతో వరి నాట్లుకి శ్రీకారం చుడుతున్నారు. ఈ ఖరీఫ్‌లో సుమారు 10,500 ఎకరాల్లో వరి నాట్లు వేయనున్నారు. కొన్ని చోట్ల వెదజల్లుతో సాగు చేస్తుండగా కొన్ని చోట్ల దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు.

జోరు వర్షం

మైలవరం: ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు జోరున వర్షం కురుస్తుండటంతో అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. స్థానికంగా వాగులు, వంకలు పొంగుతుండటంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలో మరమ్మతులు చేపట్టారు. అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మైలవరంలోని బాలయోగినగర్, అయ్యప్పనగర్, తారకరామానగర్, మండలంలోని పొందుగల, కీర్తిరాయునిగూడెం, చంద్రాల, తోలుకోడు, గణపవరం తదితర గ్రామాల్లో అంతర్గత రహదారులు బురదకయ్యలుగా మారాయి. ఏపీకి మరో వారం రోజుల పాటు వర్ష సూచనలున్నట్లు ఐఎండీ హెచ్చరించింది.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ



తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి దేవిశెట్టి కిషోర్ రూ.70వేల విలువైన టీచర్ టేబుల్స్, క్రీడా సామగ్రి సోమవారం వితరణ ఇచ్చారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేష్‌కు ఈ సామగ్రిని అందజేశారు.



ఆర్లపాడులో పూర్తయి వాటరింగ్ కోసం గడ్డిపరచిన సిమెంట్ రోడ్డు



ఆర్లపాడు సీతారామపురంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

సిమెంట్‌రోడ్లతో రహదారులకు రూపురేఖలు

గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పనులు



ఆర్లపాడు/పెనుగొలను(గంపలగూడెం): గ్రామ సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణంతో రహదారులకు రూపురేఖలు సంతరించుకున్నాయి. తిరువూరు నియోజకవర్గంలోని 77 సచివాలయాల్లో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి 200 రోజులపాటు నిర్వహించిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను గుర్తించారు. వాటికి ప్రాధాన్యతాక్రమంలో నిధులు కేటాయించి సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం వేగవంతంగా సాగుతోంది. ఎన్నో సంవత్సరాలుగా బురదకయ్యగా, ఎగుడుదిగుడుగా, అస్తవ్యస్తంగా ఉన్న రహదారులతో ఆయా ప్రాంతవాసులు పడ్డ కష్టాలు తీరుతున్నాయి. వర్షాకాలంలో ప్రధానంగా ఆ రోడ్లలో ప్రజలు ఇబ్బందులు చెప్పనలవికాకుండా ఉండేవి. ఎన్నో పర్యాయాలు సంబంధిత ప్రాంత ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టున్నా ఫలితం లేదు. చివరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వాటికి విముక్తి కల్గింది.

13 రోడ్ల నిర్మాణంపూర్తి

గంపలగూడెం మండలంలోని ఐదు సచివాలయాల పరిధిలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల చొప్పున నిధులతో పనులను చేపట్టారు. కనుమూరులో ఐదు, గుళ్లపూడిలో ఆరు, ఆర్లపాడులో రెండు సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తయింది. వీటికి రూ.50 లక్షలు ఖర్చు చేశారు. సొబ్బాలలో ఒకటి, పెనుగొలనులో 10, మేడూరులో మూడు రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. ఆర్లపాడులో సర్పంచ్ కూరాకుల త్రివేణి ఆధ్వర్యంలో మిరియాల హనుమంతరావు ఇంటి నుంచి, దండేల కోటేశ్వరరావు ఇంటి వరకు 97మీటర్లు, కొప్పెర నరసింహారావు ఇంటినుంచి పసుపులేటి విశ్వనాథం ఇంటివరకు 97 మీటర్ల పొడవు సిమెంట్ రోడ్డు నిర్మించారు. పెనుగొలను సచివాలయం పరిధిలో వైఎస్సార్ నాయకుడు గోగులమూడి చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో జింకలపాలెం ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి ఇనపనూరి కోటయ్య ఇంటి వరకు 61మీటర్లు, పంది నాగులు ఇంటి వరకు 93 మీటర్లు, పంది వెంకయ్య ఇంటివరకు 76 మీటర్లు, ఇనపనూరి మైసాలు స్థలం నుంచి కొత్తపల్లి సత్యావతి ఇంటి వరకు 43.5 మీటర్లు, కొత్తూరు శ్రీను ఇంటి నుంచి పంతంగి రామారావు ఇంటి వరకు 27.5మీటర్లు, షేక్ హుస్సేన్ ఇంటినుంచి షేక్ సత్తార్‌వలీ ఇంటి వరకు 84 మీటర్లు, చల్లగుండ్లవారిపాలెంలో ఉప్పెల శ్రీనివాసరెడ్డి ఇంటినుంచి శింగారెడ్డి శేషిరెడ్డి ఇంటివరకు 44 మీటర్లు, చింతలనర్వ ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి బొల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి ఇంటి వరకు 71.5 మీటర్లు, మోటకట్ల సత్యనారాయణరెడ్డి ఇంటి నుంచి శ్రీధరరెడ్డి ఇంటి వరకు 63 మీటర్లు, మోటకట్ల అంజిరెడ్డి ఇంటి నుంచి బాబిరెడ్డి ఇంటివరకు 44 మీటర్లు సిమెంట్ రోడ్ల పనులు కొనసాగిస్తున్నారు. మేడూరులో సర్పంచ్ లక్ష్మి ఆ ధ్వర్యంలో మూడు రహదారులకు జీఎస్‌పీ పరిచా రు. పనులను పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు, సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు పర్యవేక్షిస్తున్నారు.

గతంలో ఇబ్బందులు పడ్డాం



అస్తవ్యస్తంగా ఉన్న రహదారిలో ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు పడ్డాం. పలువార్లు అధికారులకు మొరబెట్టుకొన్నాం ఫలితం లేకుండా పోయింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తగిన నిధులను కేటాయించడంతో సిమెంట్ రోడ్డు ఏర్పడింది.

– కొంకి సీతమ్మ, ఆర్లపాడు, గంపలగూడెం మండలం

రహదారి బాగుపడింది



చిన్నపాటి వర్షానికే బురదకయ్యగా మారి నడకకు సైతం వీలులేకుండా ఉండటంతో నానాతంటాలు పడాల్సి వచ్చేది. అధ్వానంగా ఉన్న రహదారిలో రాత్రులు ప్రజలు మరింత ఇబ్బందులు పడ్డారు. సిమెంట్ రోడ్డు నిర్మించడంతో సరైన రహదారి సౌకర్యం ఏర్పడింది.

– చల్లా అనూష, ఆర్లపాడు, గంపలగూడెం మండలం

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



నూజివీడులో సర్టిఫికెట్లను అందజేస్తున్న రామిశెట్టి మురళీకృష్ణ



ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలో నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష'



తిరువూరులో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నూజివీడు: పట్టణంలోని 14వ సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు గాజుల జిత్తు, కొనతం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ లింగవరపు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులకు సంబంధించిన 598 సర్టిఫికెట్‌లను అందజేశారు. దీనిలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు పిన్నిబోయిన వీరబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వెంకటరత్నం, ఎంపీడీఓ శంకరరావు, తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీటీసీ సభ్యులు గుర్రం శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు మచ్చా హరిబాబు, నందూరి భాస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: స్థానిక తొమ్మిదో సచివాలయంలో సోమవారం జగనన్న సురక్షకార్యక్రమం జరిగింది. 1,800 మంది అర్జీదారులకు వివిధ ధ్రువీకరణపత్రాలను నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి పంపిణీ చేశారు. వార్డు ఇన్‌చార్జి షేక్ జాకీర్, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్స్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



విస్సన్నపేట: స్థానిక రాణి కల్యాణమండపంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకుడు తాణంకి రాంబాబు కుమార్తె దీప్తి, మురళీకృష్ణ వివాహ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పాల్గొని నూతన వధూవరులకు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే దంపతులు ఎస్ స్వామిదాసు, సుధారాణి, వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, ఏపీ కో–ఆపరేటివ్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఏపీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ, ఎంపీపీ దంపతులు పిల్లి మెర్సీ వనజాక్షి, రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కొండపర్వ సర్పంచ్ రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లు గణపతిరెడ్డి, మేకల రవి తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఓడించడం ఎవరి వల్ల కాదు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రజల గుండెల్లో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడం ఎవరి వల్ల కాదని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని సుంకొల్లులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్ 590 మందికి పలు రకాల సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి చంద్రబాబుకు ప్రజలు గుర్తుకువచ్చారని, కరోనా సమయంలో చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులు ఎక్కడున్నారో ప్రజలు నిలదీయాలన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వాహనమిత్ర తదితర సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికస్థాయిని పెంచుతోందన్నారు. ఏ ప్రభుత్వమైనా సంక్షేమంపై దృష్టి సారించినప్పుడే ప్రజా ప్రభుత్వం అవుతుందన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు పాలన చేసి ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. అంతేగాకుండా ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. చంద్రబాబు ఇస్తున్న హామీలను ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. చంద్రబాబుని నమ్మితే రాష్ట్రం అధోగతేనని, పదేళ్లు రాష్ట్రం వెనక్కు పోయినట్లేనని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష ప్రసంగించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎస్.రామ్మోహన్‌రావు, సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ జీ వెంకటేశ్వరరావు, నాయకులు రాంబాబు, జమలయ్య, రవీంద్రరెడ్డి, ఏఓ చాముండేశ్వరి, హెచ్‌ఓ హేమ, ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరాణి పాల్గొన్నారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



నూజివీడులో అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందనలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ స్పష్టం చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించిన సబ్‌కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు స్పందనలో అర్జీలను అందజేస్తున్నారని, వాటిని పరిష్కరించడంలో అలసత్వం ఎంతమాత్రం తగదన్నారు. ఒకవేళ అర్జీని పరిష్కరించే వీలు లేకపోతే అందుకు గల కారణాన్ని సంబంధిత అర్జీదారుడికి తెలపాలన్నారు. స్పందనలో 11 అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సుందరి, ఎస్సై జగ్జీవన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఏఈ అశోక్ పాల్గొన్నారు.

స్పందన అర్జీ పరిష్కారం

చాట్రాయి: స్పందన ద్వారా వచ్చిన సమస్యను పరిష్కరించినట్లు ఎంపీడీఓ దుర్గాప్రసాదు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మర్లపాలెం గ్రామానికి చెందిన మర్రివాడు శ్రీనివాసరావు తన ఇంటి దగ్గరల్లో చెత్త కుప్పను తొలగించాలంటూ స్పందనలో అర్జీ ఇచ్చారన్నారు. దీనిపై చెత్త ఉన్న ప్రదేశాన్ని పరిశీలించి క్లాప్ మిత్రల ద్వారా చెత్తను తొలగించినట్లు తెలిపారు. భవిష్యత్తులో తిరిగి ఈ ప్రదేశంలో చెత్త వేయకుండా చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

అలరించిన చిన్నారుల గోదాదేవి వేషధారణ



గోదాదేవి వేషధారణలో చిన్నారులు

తోటమూల(గంపలగూడెం): గోదాదేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా గంపలగూడెం జట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు అమ్మవారి వేషధారణ పోటీలు నిర్వహించారు. తోటమూల గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 50 మంది చిన్నారులు గోదాదేవి అమ్మవారి వేషధారణలో చూడముచ్చట గొల్పారు. ప్రథమస్థానంలో అస్మిత, ద్వితీయ స్థానంలో అరుణ, వినీల, తృతీయ స్థానంలో హిమశ్రీ నిలిచారు. వీరికి వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి బహుమతులను అందజేశారు. ప్రవస్థి, వాషిత, ప్రఖ్యాతలు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల సదస్సు విజయవంతం చేయాలి

గణపవరం(మైలవరం): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26న విజయవాడలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ల పోరాట కమిటీ పిలుపునిచ్చింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చాట్ల సుధాకర్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జే అనిల్‌కుమార్ సోమవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు సదస్సుకు హాజరై విజయవంతం చే యాలని కోరారు.

సచివాలయం తనిఖీ

గంపలగూడెం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. మండలంలోని నెమలి సచివాలయాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. కాపునేస్తం లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పరిశీలించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ తోట తరుణ్‌కుమార్, వీపీఏ మునీంద్ర, ఎంఎస్‌కే గుర్రం అపర్ణ పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

నెమలి/గుళ్ళపూడి(గంపలగూడెం): మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. నెమలి, గుళ్లపూడి సచివాలయాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్యాంప్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని చనుబండ–2 గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారని ఆయన చెప్పారు.

పాడిరైతుల సంక్షేమానికి కృషి



లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

తిరువూరు: వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమపై ఆధారపడిన రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ తగు చేయూత ఇస్తుందని యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని చింతలపాడు, కొమ్మిరెడ్డిపల్లి పాల సేకరణ కేంద్రాలలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించిన ఆయన లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో సిబ్బంది, రైతుల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. నాణ్యమైన పాల దిగుబడికి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ రైతులు అధిక ఆదాయం గడించాలని సూచించారు. పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ జోత్స్న

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మండలంలోని గుంటుపల్లిలో అభివృద్ధి పనులకు ఎంపీపీ పాలడుగు జోత్స్న సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక వసుందర కాలనీలో రూ.5లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో స్థానికుల కోరిక మేరకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో రూ.14లక్షలతో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్లు నిర్మాణంతో 20ఏళ్లుగా ఏర్పడిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భుక్యా కవిత, కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



చౌటపల్లి ఎంపీయూపీ స్కూల్లో ఉపాధ్యాయులకు సన్మానం

తిరువూరు: మండలంలోని చౌటపల్లి ఎంపీ యూపీ స్కూలులో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీ సభ్యులు సోమవారం సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీను, గిరి, పద్మను జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి, పేరెంట్స్ కమిటీ మారేశ్వరరావు తదితరులు సన్మానించి వారి సేవలను అభినందించారు.

యాజమాన్య పద్ధతుల్లో మేలైన పంటలు

ఇబ్రహీంపట్నం: సకాలంలో పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చని ఇబ్రహీంపట్నం బయోలాజికల్ కంట్రోల్ లేబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ జేఎల్ కిరణ్‌జ్యోతి, మండల ఏఓ డి.శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవనియంత్రణ పద్ధతిలో మిత్ర పురుగులు సంఖ్య పెంచి పైరుకు నష్టం చేసే సిలీంద్రాలు నాశనం చేసే సూడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడి మందులు స్థానిక ప్రయోగశాలల్లో తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. వరిని ఆశించే ఆకుముడత, పొడ, అగ్గి తెగుళ్లు, మిరప, మొక్కజొన్న, అరటి తదితరల పంటలను ఆశించే తెగుళ్లను సూడోమోనాస్ నివారిస్తుందని తెలిపారు. వేరుకుళ్లు తెగుళ్లను ట్రైకోడెర్మావిరిడి తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఈ జీవఉత్పత్తులు బయట మార్కెట్‌లో లభించవని, స్థానిక లేబొరేటరీలోనే లభిస్తాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.